# COMMUNIST PARTY OF INDIA (MARXIST)
## Telangana State Committee
M.B.Bhavan, H. No.1-1-60/2, RTC 'X' Roads, Hyderabad -20.
Ph. 040- 27665011 /12, Fax : 27665013, Email-cpimtelangana@gmail.com


తేది: 06.09.2022

**శ్రీయుత కె చంద్రశేఖర్‌రావు గారు**
రాష్ట్ర ముఖ్యమంత్రి
తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాదు

ముఖ్యమంత్రిగారికి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాసిన లేఖను ప్రచురణార్థం/ప్రసారార్థం పంపిస్తున్నాము.
– జె బాబూరావు, ఆఫీసు కార్యదర్శి

**విషయం:– విఆర్‌ఏల సమస్యలు పరిష్కరించి తక్షణమే సమ్మెను విరమింపజేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ....**

**ఆర్యా!**

విఆర్‌ఏ ఆత్మహత్య రెండు రోజుల క్రితం పత్రికల్లో ప్రముఖంగా ప్రచురితమైంది. సమ్మె చేస్తున్నా ప్రభుత్వ నుండి స్పందన లేదంటూ కామారెడ్డి జిల్లా బొల్లారంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గత మూడు నెలలుగా జీతాలు అందకపోవడం, ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెంది చనిపోతున్నారు. వరంగల్, హన్మకొండ, ఖమ్మం, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, నాగర్‌కర్నూలు తదితర జిల్లాల్లో గత 45రోజుల్లో 23 మంది ప్రాణాలొదిలారు. కొద్దిమంది దీక్షా శిబిరాల్లోనే గుండెపోటుతో తనువు చాలిస్తున్నారు. సమస్య తీవ్రత దృష్ట్యా మీరు స్వయంగా జోక్యం చేసుకొని పరిష్కరించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలో 23వేల మంది విఆర్‌ఏలు గత 45 రోజులుగా సమ్మె చేస్తున్నారు. తమ సమస్యలపై పలు దఫాలుగా మంత్రులు, ఎంఎల్‌ఏలు, రెవెన్యూ అధికారులను కలిసి, దరఖాస్తులు ఇచ్చి విన్నవించుకున్నారు. తహాశీల్దారు, కలెక్టర్, సిసిఎల్‌ఏ కార్యాలయాలు వద్ద ధర్నాలు నిర్వహించారు. చివరకు ఛలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చి ఇందిరా పార్క్ వద్ద ఫిబ్రవరి 22న వేలాదిమందితో ధర్నా చేసి నిరసన వ్యక్తం చేసినా ప్రభుత్వం నుండి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో జూలై 25 నుండి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె ప్రారంభించారు.

విఆర్‌ఏలు గా పనిచేస్తున్న వారిలో అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ బలహీన వర్గాలకు చెందిన పేదలు. అతి తక్కువ జీతంతో జీవనం గడుపుతున్నారు. ప్రస్తుతం ఆ వేతనం కూడా అందక కుటుంబాలు గడవక, ఇతర ఆర్థిక వెసులుబాటు లేకపోవడంతో పలు ఇబ్బందులకు గురవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి సమగ్ర కుటుంబ సర్వే, భూరికార్డుల ప్రక్షాళన, వృద్ధాప్య, వికలాంగులు వితంతువులు ఒంటరి మహిళల పింఛన్లు, కళ్యాణ లక్ష్మి, ఆధార్, రేషన్ కార్డులు, రైతు బంధు, దళిత బంధు, ధరణి పోర్టల్ సేవలతో పాటు అనేక సర్వేలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు పోవడంలో విఆర్‌ఏలు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. సమ్మె వల్ల సర్టిఫికేట్‌లు అందక విద్యార్థులు, సంక్షేమ పథకాల అమల్లో ప్ర జలు పలు ఇబ్బందులు పడుతున్నారు.

వారి శ్రమను గుర్తించామని విఆర్‌ఏలకు పేస్కేల్ ఇస్తామని అసెంబ్లీలో మీరు అసెంబ్లీలో ప్రకటించి 2 సం॥లు అయింది. ప్రభుత్వానికి రూ.260 కోట్లు అదనంగా భారమైనప్పటికీ బలహీనవర్గాలకు చెందినవారు కాబట్టి వీరందరికీ పేస్కేల్ ఇస్తామని, 55 సంవత్సరాలు పైబడిన వారి స్థానంలో వారసులకు ఉద్యోగాలు ఇస్తామని, విద్యార్హతలను బట్టి వారికి ప్రమోషన్లు కల్పిస్తామని ప్రకటించారు. పేస్కేల్ వస్తే జీతం పెరుగుతుందని, జీవితాలు బాగుపడతాయనే ఆశతో గత రెండేళ్లుగా విఆర్‌ఏలు ఎదురు చూస్తున్నారు. పిఆర్‌సి 30శాతం ఇస్తామని ప్రకటించి కూడా నేటికీ జీవో విడుదల చేయలేదు. విఆర్‌ఏలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు స్వంత గ్రామంలో నిర్మిస్తామన్న ప్రకటన కూడా అమలుకాలేదు.

మీరు జోక్యం చేసుకుని తక్షణమే విఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని, సమ్మెను విరమించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

అభివందనములతో

**(తమ్మినేని వీరభద్రం)**
రాష్ట్ర కార్యదర్శి